సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




గురువారం 16 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 318 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్




## క్వాంటమ్ టెక్నాలజీలో అమరావతి కొత్త అధ్యాయం ఎన్టీఆర్ ట్రస్ట్ విద్యార్థులకు అభినందనలు

సందేశం టైమ్స్, అమరావతి, ఏప్రిల్ 16, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో దేశానికి మార్గదర్శకంగా నిలుస్తూ అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీ (AQRF)ను ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్‌లో అమరావతి 1ఎస్, అమరావతి 1క్యూ పేర్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు క్వాంటమ్ కంప్యూటింగ్ పరికరాల పరిశీలన, ప్రమాణీకరణకు దోహదపడనున్నాయి. ఇదే సమయంలో నరేంద్ర మోదీ ఆవిష్కరించిన నేషనల్ క్వాంటమ్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా దేశంలో స్వదేశీ క్వాంటమ్ తయారీకి ఇది బలాన్నిస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఏఐ, డేటా సెక్యూరిటీ, డీప్ టెక్నాలజీ రంగాల్లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు ఐబీఎం, ఐఐటీ చెన్నై వంటి సంస్థలతో కలిసి 45 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి కల్పించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది. మరోవైపు తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన ఎన్టీఆర్ మహిళా జూనియర్, డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు అభినందనలు వెల్లువెత్తాయి. వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తున్న నాణ్యమైన విద్యకు నిదర్శనమని ప్రముఖులు ప్రశంసించారు.




## గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం – ప్రతి గ్రామానికి మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

సందేశం టైమ్స్, ఖమ్మం/పెనుబల్లి, ఏప్రిల్ 16, ప్రతినిధి: ప్రతి గ్రామానికి మెరుగైన సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లతో కలిసి పెనుబల్లి మండలం తుమ్మలపల్లిలో టీజీ ఎన్పిడిసిఎల్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ నియంత్రికల మరమ్మత్తు కేంద్రానికి శంకుస్థాపన చేశారు. అలాగే పెనుబల్లి పట్టణంలో రూ.7.50 కోట్ల వ్యయంతో నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం, విద్య రంగాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు, బలోపేతమైన విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నదని తెలిపారు. విద్యుత్ రంగంలో కొత్త సబ్‌స్టేషన్లు, మరమ్మత్తు కేంద్రాల ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా, వోల్టేజ్ నియంత్రణ, వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆరోగ్యం, విద్య రంగాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## రెండేళ్లుగా ఆపకుండా రోడ్ల నిర్మాణాలు – ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్యలు ప్రశంసనీయం





సందేశం టైమ్స్, అమరావతి, ఏప్రిల్ 16, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత రెండేళ్లుగా పలు ప్రాంతాల్లో నిరంతరంగా రోడ్ల నిర్మాణ పనులు కొనసాగిస్తూ అభివృద్ధి దిశగా కీలక అడుగులు వేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్యలు ప్రజల్లో ప్రశంసలు పొందుతున్నాయి. గన్నవరం, కోనసీమ, గణపవరం, పశ్చిమ గోదావరి, సున్నింపేట, నంద్యాల, పిఠాపురం, కాకినాడ వంటి ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఇదే సమయంలో పదవీ బాధ్యతలు స్వీకరించి 22 నెలలు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, అడవి తల్లి బాట వంటి పథకాలు ప్రజాదరణ పొందుతున్నాయి. అలాగే స్వచ్ఛ రథం, స్మార్ట్ కిచెన్, ఫిషర్‌మెన్ లైవ్‌లిహుడ్ యాక్షన్ ప్లాన్, ప్రాజెక్ట్ హనుమాన్, ఈకో టూరిజం ప్రోత్సాహం వంటి పలు కార్యక్రమాలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయి. మరోవైపు సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించినట్లు సమాచారం.



## వడదెబ్బ బాధితులకు సత్వర చికిత్సకు హాస్పిటళ్లలో ప్రత్యేక బృందాలు – మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రతినిధి: రాష్ట్రంలోని వడదెబ్బ బాధితులకు సత్వర చికిత్స అందించేందుకు ప్రతి ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆసుపత్రుల్లో తాగునీటి సౌకర్యం, అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అన్ని వార్డులు, వెయిటింగ్ ఏరియాల్లో మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వడదెబ్బ బాధితుల కోసం ఎమర్జెన్సీ విభాగాల్లో ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని, అవసరమైన శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించేందుకు బస్టాండ్లు, ఆసుపత్రులు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం సమయంలో జనరేటర్లు వెంటనే పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఫైర్ సేఫ్టీ పరికరాల తనిఖీలు మరియు మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తమిళనాడు ఎన్నికల ప్రచారంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి



సందేశం టైమ్స్, శివకాశి, ఏప్రిల్ 16, ప్రతినిధి: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని వేగవంతం చేస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సీనియర్ పరిశీలకుడు, తెలంగాణ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి శివకాశిలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ఎన్నికల వ్యూహాలు, ప్రజా సమస్యలపై పోరాటం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె సెల్వపెరుంతగైతో పాటు ఇతర నాయకులు కూడా పాల్గొని కార్యకర్తలకు ఉత్సాహం నింపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు అందరూ ఏకతాటిపైకి వచ్చి కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

## గోల్కొండ-సెవెన్ టూంబ్స్ పర్యాటక అభివృద్ధిపై మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయి పరిశీలన



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రతినిధి: సెవెన్ టూంబ్స్, కటోరా హౌస్, కేబీ మ్యూజియం ప్రాంతాలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కుతుబ్ షాహీ టూంబ్స్‌లోని ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ పనులను పరిశీలించిన మంత్రి, పెండింగ్‌లో ఉన్న పనులను మినహాయించి మిగిలిన అభివృద్ధి పనులను వారం రోజుల్లో ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోట నుంచి సెవెన్ టూంబ్స్ వరకు 1.3 కిలోమీటర్ల రోప్‌వే నిర్మాణానికి సంబంధించి అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కటోరా హౌస్‌ను సందర్శించి పరిసరాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, వ్యర్థాలను వెంటనే తొలగించాలని జీహెచ్ఎంసీకి ఆదేశించారు. గోల్కొండ సమీపంలో లాడ్ బజార్ తరహా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రతిపాదనలు రూపొందించి సంబంధిత కేంద్ర సంస్థకు పంపాలని సూచించారు. అలాగే కేబీ మ్యూజియంను పర్యాటక ఆకర్షణగా అభివృద్ధి చేయాలని, వెనుకభాగంలోని ఆక్రమణలను వారం రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

జాతీయ తెలుగు దినపత్రిక

సందేశం టైమ్స్

గురువారం 16 ఏప్రిల్ 2026





## మండల సమావేశాలు, మహిళా వ్యాపార ప్రోత్సాహంపై కలెక్టర్ దృష్టి

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 16, ప్రతినిధి: ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16న నిర్వహించే మండల స్థాయి సమావేశాలకు పూర్తి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. వెబ్ ఎక్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. పారిశుధ్యం, పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ అంశాలతో పాటు రహదారి భద్రతపై అవగాహన కల్పించి "నో హెల్మెట్ – నో ఎంట్రీ" విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశిస్తూ ప్రతి మండలంలో కనీసం 10 నూతన వ్యాపారులను గుర్తించి జూన్ 2లోపు స్థాపించాలని సూచించారు. ఉద్యమి ఆధార్ సర్టిఫికెట్ ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ టెండర్లలో పాల్గొనే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తుందని స్పష్టం చేసిన కలెక్టర్, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## కేబుల్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులు వెంటనే అక్రిడిటేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రతినిధి: కేబుల్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులు రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డులు పొందేందుకు ఈ నెల 17వ తేదీలోపు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి హెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా స్టూడియోలు కలిగి రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాల్లో ప్రసారాలు అందించే చానళ్లు రాష్ట్ర, జిల్లా స్థాయి కార్డులకు అర్హులని, జిల్లా స్థాయిలో స్టూడియోలు ఉన్న వారు ఆయా జిల్లాల్లో అక్రిడిటేషన్ పొందవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులో ఛానల్ పేరు, స్టూడియో చిరునామాతో పాటు ఎమ్ఐబీ ధృవీకరణ పత్రం, లేబర్ లైసెన్స్, ఎంఎస్ఓలతో కుదుర్చుకున్న ఛానల్ ప్లేస్‌మెంట్ ఒప్పందాల ప్రతులను జత చేయాలని సూచించారు. అర్హత గల చానళ్లకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయబడతాయని కమిషనర్ స్పష్టం చేశారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి – ఎస్ఐ వీరేందర్ సూచన



సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 16, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చింతకాని సబ్ ఇన్స్పెక్టర్ వీరేందర్ ఆధ్వర్యంలో నాగులవాంచ ఆదర్శ పాఠశాలలో అరైవ్-అలైవ్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించగా, అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు వేగం నియంత్రణలో ఉంచాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. బైక్‌పై త్రిబుల్ రైడింగ్ చేయడం నేరమని, అలాంటి చర్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 17న నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలి



సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 16, ప్రతినిధి: ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు గౌరవ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి శ్రీనివాస్ రెడ్డికు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 15.25 లక్షల ఉద్యోగులు, 206 సంఘాలకు సంబంధించిన నిర్ణయాల మేరకు దశలవారీ ఆందోళనల్లో భాగంగా మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి మండల, డివిజన్, జిల్లా స్థాయి కార్యాలయాల్లో నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు సంబంధించిన నాలుగు ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొని నిరసనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## చిన్నమండవలో ఘనంగా శ్రీమంతం, అక్షరాభ్యాస కార్యక్రమం



సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 16, ప్రతినిధి: చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలోని అంగన్వాడి కేంద్రం–1, 2 ఆధ్వర్యంలో నలుగురు గర్భిణీ స్త్రీలకు ఘనంగా శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. గుండ్ల సౌజన్య, లింగం భార్గవి, కాశీమాల ప్రీతీ, దారెల్లి రాజరాజేశ్వరి లకు పూలు, పండ్లు, గాజులు, నూతన వస్త్రాలతో వడినింపి ముత్తైదువల చేత ఆశీర్వచనాలు అందజేశారు. అదే కార్యక్రమంలో సామూహిక అక్షరాభ్యాసం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీడీపీఓ చావా కమలప్రియ, సూపర్వైజర్ పద్మావతి హాజరై గర్భిణీలకు శుభాకాంక్షలు తెలియజేసి, ఆరోగ్య పరిరక్షణ, ఆహారం, మందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరచ రాంచందర్ రావు, ఉప సర్పంచ్ తంగిరాల మాధవి, వార్డు సభ్యులు, పల్లె దవాఖానా వైద్యుడు డాక్టర్ అనిల్ కుమార్, ఏఎన్ఎం లలిత కుమారి, ఆశా వర్కర్ గుండ్ల భూసమ్మతో పాటు గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్లు లింగం నిర్మల, నండ్రు జ్యోతి నిర్వహించారు.



## అభివృద్ధి, పారదర్శకత, ప్రజా సంక్షేమంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 16, ప్రతినిధి: జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని స్పష్టం చేస్తూ ప్రతి ఇంటికి సమయానికి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గ్యాస్ సరఫరాలో అక్రమాలు అరికట్టేందుకు విజిలెన్స్ తనిఖీలు నిర్వహించాలని, అదనంగా 15 శాతం నిల్వలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదే సమయంలో జనగణనలో భాగమైన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, మే 11 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన స్కూల్ కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్లు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దిష్ట కాలపట్టికలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జహీరాబాద్ నిమ్జ్ పరిధిలో 3245 ఎకరాల భూమిని 45 రోజుల్లో ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చి జాతీయ పారిశ్రామిక కారిడార్ సంస్థకు అప్పగించాలని సూచించారు. మరోవైపు అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ సమానత్వం, న్యాయం వంటి విలువలను పాటించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అభివృద్ధి, పారదర్శకత, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## అరైవ్-అలైవ్ కార్యక్రమాలతో కోదాడలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన





సందేశం టైమ్స్, కోదాడ, ఏప్రిల్ 16, ప్రతినిధి కొండలు: కోదాడ పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్-అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులు, ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ శంకర్ నాయక్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తేజ టాలెంట్ స్కూల్ విద్యార్థులతో కలిసి రంగా థియేటర్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించి హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే స్టార్ కిడ్స్ శ్రీ చైతన్య స్కూల్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలకు గురైన వారిని తక్షణమే సురక్షితంగా ఆసుపత్రికి తరలించి సహాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వేగం నియంత్రణలో ఉంచాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో బాధితులను రక్షించిన వారికి ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్‌తో పాటు రూ.25,000 ప్రోత్సాహకం లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సంకల్పించగా, పోలీస్ శాఖ సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## మెదక్ జిల్లాలో రహదారి భద్రత, విద్యా సర్టిఫికెట్లు, మహిళల అభివృద్ధి, మండల సభలపై కలెక్టర్ ప్రతిమా సింగ్ సమగ్ర సమీక్ష



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 16, ప్రతినిధి: రహదారి భద్రత నియమాలు పాటిస్తూ వాహనదారులు బాధ్యతతో వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలం కలకల్‌లో జరిగిన అరైవ్-అలైవ్ కార్యక్రమంలో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్న ఆమె ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించి కంటి పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా తూప్రాన్ మున్సిపాలిటీలో 10వ తరగతి విద్యార్థులకు కుల, ఆదాయం, జనన ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తూ ఉన్నత చదువులకు ఇవి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అదేవిధంగా అనాథ, నిరుపేద బాలికల కోసం డిప్లొమా కోర్సుల్లో 70 శాతం సీట్లు కల్పించబడుతున్నాయని ప్రకటించి విద్యార్థినులు అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. మరోవైపు ఈ నెల 21న జరగనున్న మండల సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో వడదెబ్బ ప్రమాదాలపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, మధ్యాహ్నం 11 నుండి 4 గంటల మధ్య బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో రక్షణ చర్యలు తప్పనిసరిగా ఉండాలని, ప్రజలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, విద్య, భద్రత, ఆరోగ్యం రంగాల్లో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ఇన్నోవా ఢీకొట్టడంతో స్కూటీపై వెళ్తున్న వ్యక్తి మృతి



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 16, టౌన్ ప్రతినిధి వి సాయి: ముత్తంగి నుంచి పోచారం ఇంద్రేశం వెళ్లే ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్‌పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం అల్మైపేట గ్రామానికి చెందిన బెల్లూరి మహేష్ యాదవ్ (36) జొమాటో పార్సల్ డెలివరీ కోసం ఎలక్ట్రిక్ స్కూటీపై వెళ్తుండగా వెనుక నుంచి టీఎస్ 15 ఈఎఫ్ 9789 నంబర్ గల ఇన్నోవా కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్ యాదవ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాద సమయంలో మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్ ఘటన అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడని సమాచారం. సమాచారం అందుకున్న ఓఆర్ఆర్ టోల్ ప్లాజా సిబ్బంది వెంటనే పోలీసులకు తెలియజేయగా పటాన్చెరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టినట్లు కానిస్టేబుల్ సి కాశీనాథ్ తెలిపారు.

## భీమారంలో బసవేశ్వర విగ్రహ ప్రతిష్టాపన వీరశైవ లింగాయత్ సమాజానికి స్ఫూర్తి ప్రదాతగా మహాత్మా బసవేశ్వరుడు




సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 16, నియోజకవర్గ ప్రతినిధి కె. సంగమేశ్వర్: "మహాత్మా బసవేశ్వరుడు" వీరశైవ లింగాయత్ సామాజిక వర్గానికి ఆదర్శప్రాయుడని రాష్ట్ర వీరశైవ లింగాయత్/లింగ బలిజ సంఘం రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కడపల్ల సోమేశ్వర్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమారంలో వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బసవేశ్వర విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్తగా, వీరశైవ లింగాయత ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడిగా నిలిచారని తెలిపారు. తక్కువ సమయంలో విగ్రహ ప్రతిష్టాపన పూర్తి చేయడం అభినందనీయమని సంఘ ప్రతినిధులను అభినందించారు. రాష్ట్ర సంఘం తరఫున హనుమకొండ జిల్లా సమాజ అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర సంఘం మీడియా ఇంచార్జ్ కొట్టే మహేష్ మాట్లాడుతూ బసవేశ్వరుడు సమానత్వం, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచారని, సమాజంలో వివక్షత నిర్మూలనకు కృషి చేశారని పేర్కొన్నారు. జిల్లా సంఘం అధ్యక్షుడు పట్నం శెట్టి వీర సోమయ్య మాట్లాడుతూ ఈ విగ్రహం ద్వారా లింగాయత్ సమాజంలో నూతన ఉత్తేజం నెలకొన్నదన్నారు. కార్యక్రమ సమన్వయకర్త గుండవరం విధుమౌళి మాట్లాడుతూ బసవేశ్వరుడు మన సమాజానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని తెలిపారు. మహిళా కమిటీ ప్రతినిధి బానాల శ్రీ గౌరీ ఈ విగ్రహం ఏర్పాటుతో తమ చిరకాల కోరిక నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా సంఘాల ప్రతినిధులు, మహిళా మరియు యువజన కమిటీ సభ్యులు, భీమారం వీరశైవ సంక్షేమ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై బసవ నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి - అదనపు కలెక్టర్ నగేష్




సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 16, ప్రతినిధి: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు. బుధవారం చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే సందర్భంగా మెదక్ మండలం ముక్త భూపతిపూర్‌లో నిర్వహించిన అరైవ్-అలైవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాల పైబడిన పిల్లలను వాహనాల్లో తీసుకెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, భవిష్యత్‌లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు – సివిల్ సప్లై అధికారి నిత్యానంద హెచ్చరిక




సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 16, ప్రతినిధి: రేషన్ షాపుల్లో ఎలాంటి అక్రమాలు జరిగినా కఠిన చర్యలు తప్పవని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద హెచ్చరించారు. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలోని చింతల వెంకట నర్సయ్య గౌడ్‌కు చెందిన రేషన్ షాప్ నంబర్ 1743006పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం–2, హైదరాబాద్ అధికారులు జిల్లా పౌర సరఫరాల శాఖతో కలిసి తనిఖీలు నిర్వహించగా, షాపులో ఉండవలసినదానికంటే 12.68 క్వింటాళ్ల బియ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో సంబంధిత డీలర్‌పై EC ACT–1955 నిబంధనల ప్రకారం 6-A కేసు నమోదు చేశారు. ప్రజలకు రేషన్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా షాప్ 1743006 బాధ్యతలను తాత్కాలికంగా తూప్రాన్ మండలం దాతార్పల్లి గ్రామానికి చెందిన డీలర్ మేకల ప్రవీణ్ కుమార్ (1743008)కు అప్పగించారు. భవిష్యత్తులో రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సివిల్ సప్లై అధికారి నిత్యానంద స్పష్టం చేశారు.



## అల్లాదుర్గ్ మండలంలో వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం - రైతులు ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని పిలుపు

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 16, ప్రతినిధి: అల్లాదుర్గ్ మండలంలోని ముస్లాపూర్, అప్పాజీపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం క్వింటాలుకు సాధారణ వరి ధాన్యానికి రూ.2389, ప్రత్యేక రకానికి రూ.2369 మద్దతు ధరను కల్పిస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ధాన్యం విక్రయానికి అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి నిబంధనలను పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఏవో రాజేష్, ఏఈఓ నవీన్, సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, సొసైటీ నిర్వాహకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమ శాఖను అన్ని జిల్లాల్లో స్వతంత్రంగా కొనసాగించాలని NPRD, స్కైటు సంఘాల వినతి



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రతినిధి: దివ్యాంగుల సంక్షేమ శాఖను అన్ని జిల్లాల్లో స్వతంత్ర శాఖగా బలోపేతం చేయాలని కోరుతూ ఎన్‌పిఆర్‌డీ ఇండియా, స్కైటు సంఘాల ఆధ్వర్యంలో దివ్యాంగుల సాధికారిత శాఖ కమిషనర్ బి. శైలజను ఎర్రమంజిల్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు వినతిపత్రం సమర్పిస్తూ, గతంలో దివ్యాంగుల శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖలో విలీనం చేయడంతో దివ్యాంగులకు అన్యాయం జరిగిందని తెలిపారు. అనంతరం పోరాటాల ఫలితంగా జీవో నం.23 (02-12-2022) ద్వారా శాఖకు స్వతంత్ర హోదా లభించినప్పటికీ, అన్ని జిల్లాల్లో పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో పరిపాలన సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డీ ఇండియా జాతీయ అధ్యక్షులు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షులు దైనంపల్లి మల్లికార్జున్, స్కైటు రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



## కౌడిపల్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 16, ప్రతినిధి: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, మండల అధికారులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సారా రామగౌడ్, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు గృహ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## 2026 శాసనసభ ఎన్నికల కోసం ఓటరు సమాచార పత్రాల పంపిణీ ప్రారంభం - భారత ఎన్నికల సంఘం ప్రకటన

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, ప్రతినిధి: 2026 శాసనసభ సాధారణ ఎన్నికలు మరియు ఉప ఎన్నికల నేపథ్యంలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఓటరు సమాచార పత్రాల (VIS) పంపిణీ ప్రారంభించినట్లు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటనలో, పోలింగ్ తేదీ, సమయం, పోలింగ్ కేంద్రం వివరాలు, మ్యాప్ స్నాప్‌షాట్‌తో పాటు ఓటర్లకు అవసరమైన సూచనలు VISలో పొందుపరచినట్లు తెలిపింది. ఓటర్ల సౌలభ్యం కోసం QR కోడ్ ద్వారా వివరాలు వేగంగా తెలుసుకునే అవకాశం కల్పించారని పేర్కొంది. బూత్ లెవెల్ అధికారులు (BLOలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు వ్యక్తిగతంగా VIS పంపిణీ చేస్తున్నారని, పోలింగ్‌కు కనీసం 5 రోజుల ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించింది. దివ్యాంగ ఓటర్ల కోసం బ్రెయిలీ సౌకర్యాలతో ప్రత్యేక AVIS కూడా అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది. VISను గుర్తింపు పత్రంగా ఉపయోగించలేమని, ఓటింగ్ కోసం EPICతో పాటు అధీకృత 12 గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి అవసరమని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పంపిణీ సమయంలో అనధికార జోక్యం చట్టవిరుద్ధమని హెచ్చరించింది.

# కుటుంబ కలహాలు, మద్యం మత్తు నేపథ్యంలో యువకుడి ఆత్మహత్యతో విషాదం



సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 16, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం భూత్కూర్ గ్రామంలో కుటుంబ కలహాలు, మద్యం అలవాటు నేపథ్యంలో 28 ఏళ్ల యువకుడు గొల్ల @ దొడ్లే లక్ష్మణ్ ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా విషాదాన్ని కలిగించింది. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న లక్ష్మణ్‌కు మద్యం సేవించే అలవాటు ఉండటంతో తరచూ భార్యతో గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఏప్రిల్ 14 సాయంత్రం మద్యం మత్తులో భార్యతో వాగ్వాదానికి దిగిన అతను ఇంటి నుంచి బయటకు వెళ్లి, అనంతరం తన ఫోన్ ద్వారా "ఆత్మహత్య చేసుకుంటాను" అని వీడియో పంపడం కలకలం రేపింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెతకగా గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో వేప చెట్టుకు ఉరి వేసుకున్న స్థితిలో అతని మృతదేహం కనిపించింది. ఘటనపై బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# బోరంచ శ్రీ నల్ల పోచమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు – ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశం



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 16, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామంలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి 7 వారాల జాతరను ఈ నెల 23 నుంచి జూన్ 4 వరకు వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మాట్లాడుతూ భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, చలువ పందిళ్లు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. క్యూ లైన్లలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా వాలంటీర్లు, పోలీసులతో సమన్వయం చేయాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అత్యవసర వైద్య సేవలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. జాతర సమయంలో అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని, తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ శివ రుద్రప్ప, కమిటీ చైర్మన్ మల్లయ్య, సర్పంచ్ పంచగామ బీరప్ప, ఉపసర్పంచ్ మొల్ల కరీం, తహసీల్దార్ విష్ణు సాగర్, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# పోచమ్మ దేవాలయ నిర్మాణానికి నాటక కళాకారుల రూ.60 వేల విరాళం

సందేశం టైమ్స్, రాయికోడ్, ఏప్రిల్ 16, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలో భద్రకాళి సమేత వీరభద్రేశ్వర జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన పెద్దరాజు–పెద్దమ్మ నాటకంలో పాత్రధారులకు వచ్చిన కట్నకానుకల రూపంలో సమకూరిన రూ.60,000లను నాటక కళాకారులు సామాజిక బాధ్యతతో మంచి కార్యానికి వినియోగించాలని నిర్ణయించి, గ్రామ పెద్దల సమక్షంలో రాయికోడ్ గ్రామంలోని పోచమ్మ దేవాలయ నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దైవకార్యానికి ఉదారంగా విరాళం అందించిన నాటక పాత్రధారులను గ్రామ పెద్దలు, ప్రజలు హర్షిస్తూ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ విరాళం దేవాలయ నిర్మాణానికి తోడ్పడటంతో పాటు గ్రామంలో భక్తి, ఐక్యతను ప్రతిబింబిస్తోందని వారు పేర్కొన్నారు.

# రైతుల భూముల రక్షణకు వికారాబాద్‌లో మహా ధర్నా – ఆర్డీవో కార్యాలయం ముట్టడి



సందేశం టైమ్స్, వికారాబాద్, ఏప్రిల్ 16, ప్రతినిధి: వికారాబాద్ జిల్లా పరిగి మండలం పరిధిలోని కాడ్లపూర్, రాపోల్ తదితర గ్రామాల రైతుల భూములను ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకుంటోందని ఆరోపిస్తూ రైతులు, ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో OBC, SC, ST జేఏసీ మరియు ధర్మ సమాజ్ పార్టీ (DSP) వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత హాజరై రైతులకు మద్దతు తెలిపారు. అనంతరం ఆందోళనకారులు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడి చేసి తమ డిమాండ్లను అధికారులకు వినిపించారు. రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం తక్షణమే నిలిపివేయాలని, న్యాయమైన పరిహారం కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




# పోసానిపేట ప్రభుత్వ పాఠశాలలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహణ

సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 16, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం పోసానిపేట గ్రామ ప్రభుత్వ పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రగతి పరిపాలన కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక పోలీస్ అధికారి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ముందుగా రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వినియోగం, జీబ్రా క్రాసింగ్ ప్రాముఖ్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ చిన్నారులు రోడ్లపై జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం గ్రామంలో మంచి స్పందన పొందడంతో పాటు విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# అంబేద్కర్ ఆశయాలు యువతకు మార్గదర్శకం – సంగారెడ్డిలో న్యాయ అవగాహన సదస్సు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 16, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా సంగారెడ్డి గిరిజన బాలుర న్యాయ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు న్యాయ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే మూల సూత్రాలను అందించిన మహనీయుడని పేర్కొంటూ ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని, ముఖ్యంగా బాలల సంరక్షణ చట్టం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక నిరోధక చట్టం, అలాగే రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. న్యాయ సమస్యలపై అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాకల్ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవంలో సందేశం టైమ్స్ ప్రతినిధుల పాల్గొనడం



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 16, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం పరిధిలోని ర్యాకల్ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవంలో సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ టి. సంగమేశ్వర్, అందోల్ నియోజకవర్గం ఇన్‌చార్జి కే. మల్లేశం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జాతర కార్యక్రమాల్లో భాగంగా 16న బండ్ల ప్రదర్శన, 17న పాచిబండ్ల ప్రదర్శనతో నిండు జాతర, 18న కుస్తీ పోటీలు, 19న చివరి పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పూజారి తుకారాం గౌడ్, ప్రభాకర్ గౌడ్, రామా గౌడ్, నరసింహ గౌడ్, సాయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అడ్మిషన్లు అందజేస్తున్న ఆస్క్ అధ్యక్షురాలు బల్గూరి స్నేహ దుర్గయ్య



సందేశం టైమ్స్, కోదాడ, ఏప్రిల్ 16, ప్రతినిధి: ఆస్క్ కోదాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్, టీజీ ఆర్జేసీ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులకు అడ్మిషన్లు అందజేస్తున్నట్లు అధ్యక్షురాలు బల్గూరి స్నేహ దుర్గయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 16-04-2026 నుండి పాలిటెక్నిక్, టీజీ ఆర్జేసీ తరగతులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడతాయని, విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా తరగతులకు క్రమంగా హాజరు కావాలని సూచించారు. కోచింగ్ సెంటర్‌లో ఎక్కువ మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడం పట్ల ఆస్క్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్క్ ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్ రావు, కోర్స్ డైరెక్టర్ యలమర్తి శౌరి, పర్యవేక్షకులు బొడ్డు హుస్సేన్, నందిపాటి సైదులు, కోర్స్ కోఆర్డినేటర్ గంధం బుచ్చారావు, మాతంగి సురేష్, కనుకు శ్రీకాంత్, విద్యార్థి ఎం. గగన్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.